క్లుప్తంగా

కె.కె. రాజుకు అభినందన



కె.కె. రాజును అభినందిస్తున్న దేవన్‌రెడ్డి తదితరులు

గాజువాక: వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కె.కె. రాజును ఆ పార్టీ గాజువాక నాయకులు అభినందించారు. పార్టీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో నగరంలో కె.కె. రాజును కలిసిన నాయకులు ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించారు. ఆయన మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, నాయకులు ధర్మాల శ్రీను, బోగాది సన్ని, జీలకర్ర నాగేంద్ర, బొడ్డ గోవింద్, భూపతిరాజు శ్రీనివాసరావు, గొందేశి బుజ్జి, నక్క రమణ, నంబాల రాము, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐలోని డ్రైవింగ్ స్కూల్లో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఉండాలని, అభ్యర్థుల వయసు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. 45 రోజుల పాటు శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు ఎల్ఎల్ఆర్ కలిగి ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు వచ్చే నెల 5 తేదీ లోగా తమ ఐటీఐలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491762841, 9989014703 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కార్డన్ సెర్చ్‌లో 7 వాహనాలు స్వాధీనం



స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీఐ పార్థసారథి

అక్కిరెడ్డిపాలెం: గాజువాక చిట్టినాయుడు కాలనీలో గాజువాక పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. గురువారం కాలనీలో ప్రతి ఇంటిని పరిశీలించారు. ఇంట్లో గంజాయి ఇతర మాదక ద్రవ్యాలు, మద్యం నిల్వల వంటివి ఉన్నాయా అని పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు లేని 7 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కాలనీలోకి కొత్తవారు ఎవరైనా వచ్చారా అని వివరాలు తెలుసుకున్నారు. కొత్తవారిని ఎవరైనా గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని సీఐ పార్థసారథి తెలిపారు. సీఐ ఎ.పార్థసారథి, ఎస్ఐలు రవికుమార్, నజీర్, 20 మంది సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

అక్కిరెడ్డిపాలెం: ఆటోనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కేవీ తోకాడ ఫీడర్ మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని జోన్-2 ఈఈ బి.కె.నాయుడు గురువారం తెలిపారు. తోకాడ, పార్ట్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సాయి ఆలయంలో అన్న సమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 6 గంటలకు కాకడ ఆరతి, 8 గంటలకు బాబాకు పంచామృతాలతో అభిషేకాల అనంతరం పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం బాబాకు పల్లకీ సేవ నిర్వహించారు.

క్రీడల్లో మేటి.. లేరెవరూ పోటీ



కబడ్డీ పోటీల్లో రన్నరప్ కప్‌తో క్రీడాకారులు



ఎక్స్‌లెన్స్ ట్రోఫీ అందుకుంటున్న స్టీల్‌ప్లాంట్ జీఎం ఘోష్

- ఇంటర్ స్టీల్‌ప్లాంట్ క్రీడల్లో మేటి విశాఖ స్టీల్‌ప్లాంట్
- పలు క్రీడాంశాల్లో సత్తా చాటుతున్న ఆటగాళ్లు
- యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహమే కారణమంటున్న కోచ్

ఉక్కునగరం: జాతీయ ఉక్కు పరిశ్రమల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. నాణ్యమైన ఉత్పత్తికి పేరెన్నికగన్న స్టీల్‌ప్లాంట్ క్రీడల్లో కూడా అంతే ప్రాముఖ్యత కలిగి ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మొదటి నుంచి క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఉక్కునగరంలో భారీ స్టేడియం నిర్మించింది. దీనికి తోడు ఉక్కునగరంలో త్రిష్టా మైదానం, ప్రత్యేకంగా హాకీ ఫీల్డ్ ఏర్పాటు చేశారు. స్కేటింగ్‌ను ప్రోత్సహించేందుకు ఇందిరా గాంధీ పార్కులో స్కేటింగ్ రింక్ నిర్మించారు. అదే విధంగా ప్రతి క్లస్టర్లలో ఆయా క్వార్టర్స్‌లో ఉండే ఉద్యోగులు, మహిళలు, పిల్లలు ఆడుకునేందుకు ప్రత్యేక స్థలాన్ని సమకూర్చింది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన యువతకు అనేక క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తూ పోత్సహిస్తోంది. దీంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు అన్ని రకాల క్రీడల్లో విశేష ప్రతిభ చూపి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అనేక పతకాలు సాధిస్తున్నారు. ఇదిలా ఉండగా దేశంలోని స్టీల్‌ప్లాంట్లలోని ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలికి తీయడానికి స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డు (ఎస్‌పీఎస్‌బీ) ఏర్పాటైంది. ఆ స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో ప్రతి ఏటా క్రీడా పోటీలు నిర్వహిస్తుంటారు. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, క్రికెట్, హాకీ, టేబుల్ టెన్నిస్, కబడ్డీ, వాలీబాల్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తుంటారు. ఎస్‌పీఎస్‌బీ నిర్వహించే పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్, అల్లాయ్ స్టీల్‌ప్లాంట్, భిలాయ్ స్టీల్‌ప్లాంట్, బొకారో స్టీల్‌ప్లాంట్, దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్, ఇస్కో స్టీల్‌ప్లాంట్, రూర్కెలా స్టీల్‌ప్లాంట్, సేలం స్టీల్‌ప్లాంట్, విశ్వేశ్వర ఐరన్ అండ్ స్టీల్‌ప్లాంట్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్‌ప్లాంట్ జట్ల క్రీడాకారులు పాల్గొంటారు.



వాలీబాల్ పోటీల్లో రన్నరప్ షీల్డుతో క్రీడాకారులు



బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారులు



క్రికెట్ చాంపియన్‌షిప్ అందుకుంటున్న క్రీడాకారులు

సాధించిన విజయాలు

- ఎస్‌పీఎస్‌బీ ఆధ్వర్యంలో 2024–25లో నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ జట్టు చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది
- బొకారో ఉక్కులో నిర్వహించిన క్రికెట్ పోటీలో చాంపియన్‌షిప్ గెలుపొందారు.
- రూర్కెలా స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో రన్నరప్‌గా నిలిచింది.
- బొకారో స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో రన్నరప్ కప్ కైవసం.
- అల్లాయ్ స్టీల్‌ప్లాంట్‌లో నిర్వహించిన చెస్ పోటీల్లో తృతీయ స్థానంలో గెలుపొందారు.

పలు పోటీల్లో ఆటగాళ్లు..

2024–25లో స్పోర్ట్స్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు ప్రతిభ చూపి చాంపియన్‌షిప్, రన్నరప్ కప్‌లు కైవసం చేసుకున్నారు. తద్వారా స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ బోర్డ్ (ఎస్‌పీఎస్‌బీ)కి ఎక్స్‌లెన్స్ ట్రోఫీ లభించింది. గత వారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సెయిల్ చైర్మన్ చేతుల మీదుగా స్టీల్‌ప్లాంట్ జీఎం ఘోష్ ట్రోఫీ అందుకున్నారు.

క్రీడలకు చక్కని ప్రోత్సాహం



స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం క్రీడలను ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా ఉద్యోగులు, స్థానిక యువతకు వివిధ క్రీడలపై శిక్షణ ఇస్తోంది. అందు వల్లనే స్టీల్‌ప్లాంట్ క్రీడాకారులు అన్ని పోటీల్లో రాణిస్తూ అనేక జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధిస్తున్నారు. యువత శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం

– రామస్వామి, స్టీల్‌ప్లాంట్ వాలీబాల్ కోచ్

భవిత విద్యార్థికి బంగారు పతకం



రాజేష్‌ను అభినందిస్తున్న ఎంఈవోలు శ్రీనివాస్, రమణాజీ, హెచ్‌ఎం శ్రీనివాస్

పెదగంట్యాడ: రాష్ట్ర స్థాయి స్పెషల్ క్రీడా పోటీల్లో పెదగంట్యాడ భవిత కేంద్రం విద్యార్థి సత్తా చాటాడు. బంగారు పతకం సాధించి ఔరా అనిపించాడు. రాష్ట్ర విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏలూరులోని హీల్ పారడైజ్ పాఠశాలలో ఇటీవల ప్రత్యేక అవసరాల పిల్లల కోసం స్పెషల్ ఒలింపిక్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు విశాఖపట్నం జిల్లా నుంచి ఆరుగురు విద్యార్థులు హాజరయ్యారు. అందులో పెదగంట్యాడ భవిత కేంద్రానికి చెందిన నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న వేచలపు రాజేష్ క్రీడల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు ఆ విద్యార్థిని గురువారం మండల విద్యాశాఖాధికారులు ఇమంది శ్రీనివాసరావు, కంకటాల రమణాజీ, పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, భవిత కేంద్రం నిర్వాహకులు అభినందించారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 0608100 11006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామ అప్పారావుకు ప్రజా సంఘాల సత్కారం



రామ అప్పారావును సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: లేటు వయసులో పట్టుదలతో ఇంటర్‌లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన పట్టా రామ అప్పారావును అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు సత్కరించాయి. 63 ఏళ్ల వయసులో నిత్య కృషీవలుడు పట్టా రామ అప్పారావు ఓపెన్ ఇంటర్ పరీక్షలకు హాజరై ఫస్ట్‌క్లాస్‌లో పాసైన విషయం విదితమే. ఈ మేరకు పెదమడక సంపత్ వినాయక ఆలయ కమిటీ, రామాలయ కమిటీ, సర్వహిత చారిటబుల్ ప్రతినిధులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మోటూరి వెంకట రమణ, గుదే సుశీలా గజేంద్రరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ అన్నార్తులు, అభాగ్యుల కష్టాలకు చలించే మనస్తత్వం ఉన్న అప్పారావు పట్టు వదలని విక్రమార్కునిలా చదువులో ముందుకు వెళ్తుండడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విందుల నారాయణరావు, ఉమామహేశ్వరరావు, అపరపిని సోమేశ్వరరావు, మజ్జి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు దీక్షా శిబిరాన్ని సందర్శించిన వై.ఎస్. షర్మిల



నాయకులతో చర్చిస్తున్న వై.ఎస్. షర్మిల

కూర్మన్నపాలెం: స్థానికంగా నిర్వహిస్తున్న విశాఖ ఉక్కు పోరాట కమిటీ దీక్షా శిబిరాన్ని గురువారం ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల సందర్శించారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులతో కర్మాగారానికి సంబంధించిన అనేక అంశాలపై చర్చించారు. ప్రధానంగా కాంట్రాక్ట్ కార్మికుల తొలగింపు, కర్మాగారాన్ని సంక్షోభంలోకి నెట్టడం వంటి అంశాలను నాయకులు షర్మిలకు వివరించారు. ఈ విషయాలపై ఆమె స్పందిస్తూ తాను కూడా ప్రత్యక్ష పోరాటంలో పాల్గొంటానని ఆమె తెలిపారని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు అయోధ్యరామ్, ఆదినారాయణ. శ్రీనివాసరావు, ప్రసాద్, సుబ్బన్న వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి వ్యతిరేకంగా శాంతి ర్యాలీ



పెదగంట్యాడ కూడలి వద్ద బీజేపీ నాయకుల మానవహారం



ఉక్కు అమరవీరుల కూడలి వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

పెదగంట్యాడ: పహల్గాంలో ముష్కరుల తూటాలకు బలైన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, ఉగ్రవాదులు ఇలాంటి చర్యల వల్ల భారతీయుల ఐక్యత, దేశ సమగ్రతలను బలహీనపరచలేరని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో శాంతి ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్ టెర్రరిజం నశించాలి అంటూ నినాదాలు చేశారు. విహారయాత్రకు వెళ్లిన వారిని ఇలా చంపడం అత్యంత బాధకరమన్నారు. అనంతరం మనవహారం నిర్వహించి మృతుల ఆత్మకు శాంతి చేకూరాని మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పేర్ల అప్పారావు, కిల్లాన ముసలయ్య, జిలకర్ర రమణ, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి అమానుషం..

ఉక్కునగరం: స్టీల్ సీపీఎం డివిజన్ ఆధ్వర్యంలో పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. కార్పొరేటర్ బి. గంగారావు మాట్లాడుతూ ముష్కరులు పర్యాటకులపై దాడికి పాల్పడటం దుర్మార్గమన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరాజు, డీసీహెచ్ వెంకటేశ్వరరావు, బి.ఎస్. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సెలవులపై వింత రూల్స్

- సెలవు పెడితే అవసరం లేని అధికారులకు చెప్పాలట
- కేజీహెచ్ సూపరింటెండెంట్ ఉత్తర్వులపై ఉద్యోగుల ఆగ్రహం

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో రోజుకో వింత రూల్ పుట్టుకొస్తుంది. ఈ రూల్స్‌తో ఉద్యోగులు, సిబ్బంది సతమతమవుతున్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందించే విషయంలో దృష్టి పెట్టని ఉన్నతాధికారులు.. పరిపాలన విభాగంలో లేనిపోని విధానాలు తెరపైకి తీసుకొచ్చి మానసికంగా వేధిస్తున్నారంటూ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ జారీ చేసిన ఉత్తర్వు మినిస్టీరియల్ ఉద్యోగుల్లో కలకలం రేపుతోంది. వాస్తవానికి ఏదైనా కార్యాలయంలో ఉద్యోగి సెలవు పెడితే ఆయా విభాగానికి సంబంధించిన ఉన్నతాధికారి నుంచి అనుమతి తీసుకుంటే సరిపోతుంది. పై స్థాయి అధికారులకు ఆ సమాచారం అందించాల్సిన అవసరం ఉండదు. కేజీహెచ్‌లో మినిస్టీరియల్ సిబ్బంది అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ) పరిధిలో ఉంటారు. కార్యాలయంలోని మేనేజర్ సంతకంతో పాటు ఏడీ సంతకం తీసుకుని సెలవుకు వెళ్తే సరిపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఆస్పత్రుల్లో ఇదే విధానం అమలవుతోంది. కేజీహెచ్‌లో మాత్రం కింది స్థాయి ఉద్యోగి సెలవు పెడితే సూపరింటెండెంట్ అనుమతి తీసుకోవాలంటూ వింత రూల్ అమలు చేస్తున్నారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పుస్తక పఠనంతో అపార విజ్ఞానం



వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

గాజువాక: పుస్తకాలు చదవడం వల్ల ప్రపంచ స్థాయిలో పరిజ్ఞానం లభించడంతో పాటు అనేక మంది స్నేహితులు, రచయితలు, సమాజంలోని భిన్నవర్గాల ప్రజలు చేరువవుతారని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఎం.రమేష్ కుమార్ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవ వారోత్సవాలను జేవీవీ ఆధ్వర్యంలో శ్రీనగర్‌లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. చిరిగిపోయిన చొక్కా అయినా ధరించు, మంచి పుస్తకం కొను అనే విషయాన్ని సోదాహరణంగా వివరించారు. ప్రతి ఒక్కరూ పుస్తకాలను కచ్చితంగా చదవాలని కోరారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీకే పరశురామ్ మాట్లాడుతూ ప్రపంచ పుస్తక వారోత్సవాలను రచయిత శ్రీశ్రీ జయంతి రోజైన ఈనెల 30వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. పుస్తకాలు పిలుస్తున్నాయి అనే నినాదంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేధావులు తదితరులు పుస్తక ప్రియుల వద్దకు పుస్తకాలను తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు ఎం.సింహాచలం, నూకరత్నం, తులసీరత్నం, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రేపు బీచ్ కబడ్డీ పోటీలకు విశాఖ జట్ల ఎంపిక

ఎంవీపీకాలనీ: రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి విశాఖ జిల్లాల పురుషులు, మహిళల జట్లను ఈ నెల 26న ఎంపిక చేయనున్నట్లు విశాఖ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.ఎస్.వి.ప్రసాదరెడ్డి తెలిపారు. ఆరోజు మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కే బీచ్ వేదికగా ఈ జట్లు ఎంపిక జరుగుతుందన్నారు. 85 కేజీలలోపు పురుషులు, 75 కేజీలలోపు మహిళలు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన జట్లు మే 2 నుంచి 4వ తేదీ వరకు కాకినాడ బీచ్‌లో జరిగే 12వ రాష్ట్ర అంతర్ జిల్లాల బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్‌లో విశాఖ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. వివరాలకు 96666 55355, 80084 85344 నంబర్లను సంప్రదించాలని సూచించారు

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అరకొర పెన్షన్ డబ్బులతో ఓ పక్క ఆరోగ్యం చూసుకుంటూ మరోపక్క సేవా కార్యక్రమాల్లో తరిస్తుంది అగనంపూడి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు చేపట్టగా, నేడు జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శనివాడ వేపచెట్టు కూడలిలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.బోసుబాబు, బి.భాస్కరరాజు చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారని, వేసవి తాపం అధికం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల దాహార్తి తీర్చాలనే లక్ష్యంతో చలివేంద్రాన్ని ప్రారంభించామన్నారు. మజ్జిగ, మంచినీరు అందుబాటులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమ నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన అసోసియేషన్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, ఎం.డి.రఫీలకు వారు ధన్యవాదాలు చెప్పారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు కొల్లి జయ, వెంకటరావు దంపతులు, విందుల వరహాలు, బత్తుల కాళిదాస్, విశ్వనాథం, రాజు, నూకరాజు, ఈశ్వరరావు, ప్రసాద్, గొల్లవిల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో అడ్మిషన్లు ప్రారంభించాలి



స్టీల్‌ప్లాంట్ కేవీ వద్ద నిరసనలో పాల్గొన్న కార్పొరేటర్ గంగారావు, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో తక్షణమే మొదటి, 11వ తరగతి అడ్మిషన్లు ప్రారంభించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఈ అంశంపై గురువారం కేంద్రీయ విద్యాలయం వద్ద స్టీల్ సీఐటీయు ఆధ్వర్యంలో విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆదేశాలతోనే స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేంద్రీయ విద్యాలయం, విశాఖ విమల విద్యాలయాలను మూసివేయాలని కుట్ర చేస్తున్నాయన్నారు. అందుకే ఈ పాఠశాలల్లో అడ్మిషన్లు చేపట్టడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకంలో భాగంగా ఈ విద్యా సంస్థలను నారాయణ, చైతన్య వంటి సంస్థలకు ధారాదత్తం చేయడానికి పూనుకున్నాయన్నారు. ఉక్కు జనరల్ ఆస్పత్రిని కూడా ప్రైవేటు వాళ్లకు ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. అనకాపల్లి, విశాఖ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ రెండు పాఠశాలల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు వై.టి. దాస్, ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, పుల్లారావు, మొహిద్దీన్, భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి ఆరాధనోత్సవం



ఉక్కు సత్యసాయి మందిరంలో అష్టోత్తర పూజలో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: సత్యసాయి 14వ ఆరాధనోత్సవం గురువారం ఘనంగా జరిగింది. సత్యసాయి సేవ, ఆధ్యాత్మిక మందిరంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. రుత్విక్కులు రుద్రాభిషేకం చేశారు. జయ గౌరీ కామేశ్వరి ఆధ్వర్యంలో 1008 పుష్పాలతో సామూహిక సత్యసాయి దివ్య సహస్ర నామార్చన నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేదం, విష్ణు సహస్ర నామ పారాయణం, సత్యసాయి అష్టోత్తరం పఠించారు. సత్యసాయి భక్తులు కె.ఎస్.ఎస్. రాజు ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా జనరల్ ఆస్పత్రి బస్టాప్ చలివేంద్రం వద్ద పులిహోర ప్రసాదం, పాదరక్షలు, గొడుగులు పంపిణీ చేశారు. అనంతరం దత్తత గ్రామాలకు చెందిన పేదలకు నెలకు సరిపడ వస్తువులతో కూడిన అమృత కలశాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సమితి కన్వీనర్ జి. రామకృష్ణ, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా మినీ బాలోత్సవం



నృత్యం చేస్తున్న చిన్నారులు

దాబాగార్డెన్స్: వీసీసీ–ఆసరా మినీ బాలోత్సవం గురువారం అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఉల్లాసంగా సాగింది. ఆసరా వార్షిక సమావేశంలో భాగంగా బాలోత్సవం నిర్వహించారు. బాలోత్సవం ప్రెసిడెంట్ పిల్లల మర్రి రఘు, రోటరీ క్లబ్ విశాఖపట్నం ప్రెసిడెంట్ వినయ్‌గాంధీ, ఆసరా చారిటబుల్ సొసైటీ సభ్యులు సుధ, శోభ, సంజయ్, డాక్టర్ కె. రమాప్రభ, కార్యక్రమ కన్వీనర్ సుశీల పాల్గొని ప్రారంభించారు. చదువుతో పాటు ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. నిత్యం చదువుల ఒత్తిడి నుంచి అందిరికీ ఇది ఒక ఆటవిడుపుగా ఉంటుందన్నారు. వీసీసీ క్లబ్ నేతృత్వంలో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్, క్లబ్స్ విద్యార్థులు సుమారుగా 500 మంది ఎల్‌కేజీ నుంచి పదో తరగతి పిల్లలు పాల్గొన్నారు. చిత్రలేఖనం, కథ చెప్పడం, మెమరీ టెస్ట్, ఫ్యాన్సీ డ్రెస్, రైమ్స్, బృందగానం, జానపద బృంద నృత్యం, లఘు నాటిక, ఏకపాత్రాభినయం, బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.